RNI NO.TELTEL/2022/83842

PRABHATA GAMANAM

ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

వరంగల్ | సంచిక 315 | సంపుటి 4 | శుక్రవారం | 21-08-2026 | పేజీలు 4 | వెల 3/-

సబ్ ప్లాన్ నిధులు మళ్లిస్తే చర్యలే

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
- ఎస్సీ,ఎస్టీ యువత ప్రభుత్వం కల్పిస్తున్న పథకాల ద్వారా శిక్షణ పొంది ఉపాధి పొందాలి

మహబూబాబాద్, ఆగస్టు 20(ప్రభాత గమనం):

గురువారం ప్రభుత్వ గిరిజన డిగ్రీ కళాశాల ను సందర్శించారు అనంతరం ఐడిఓసిలో ఎస్సి, ఎస్టీలకు సంబంధించిన భూ సమస్యలు, ఆర్ ఓ ఆర్, ఉద్యోగుల పదోన్నతులు, ఉప ప్రణాళిక నిధులు వినియోగం, సంక్షేమం, హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ పథకాల అమలు, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసుల పురోగతి తదితర అంశాలపై, ఎస్పీ డాక్టర్ శబరిష్, రెవెన్యు అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ పురుషోత్తం తో కలిసి వివిధ శాఖల అధికారులతో కమిషన్ చైర్మన్, సభ్యులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ మంజూరైన నిధులను ఎస్సి, ఎస్టీ ఆవాసాలకు ఖర్చు చేయకపోతే ఆయా శాఖల అధికారులదే భాధ్యత ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, రక్షణలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, అభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ప్రజల సమస్యలను కేవలం కార్యాలయాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కరించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీలపై జరిగే అఘాయిత్యాలకు సంబంధించిన కేసుల విషయంలో పోలీసులు, రెవెన్యూ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని చైర్మన్ సూచించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసుల పురోగతిపై సమీక్షించారు. కేసుల దర్యాప్తు, బాధితులకు న్యాయం, పరిహారం అందించడం వంటి అంశాల్లో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసులను నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కేసుల పురోగతిని సమర్థవంతంగా పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీతో పాటు సంబంధిత అధికారులను ఆయన అభినందించారు. ప్రమోషన్లలో రోస్టర్ రిజర్వేషన్లు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించే సమయంలో రోస్టర్ రిజర్వేషన్ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని ఆయన స్పష్టం చేశారు. ప్రమోషన్లలో రిజర్వేషన్ నిబంధనల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, సంబంధిత అధికారులు నిబంధనలను పూర్తిగా పాటించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు రాజ్యాంగపరంగా కల్పించిన హక్కులకు భంగం కలగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. బాధితులకు పరిహారంతో పాటు ఉపాధి, పునరావాసం

తీవ్రమైన నేరాలకు, ముఖ్యంగా హత్య, అత్యాచారం వంటి ఘటనలకు గురైన ఎస్సీ, ఎస్టీ బాధిత కుటుంబాలను కేవలం పరిహారంతోనే వదిలేయకుండా వారి పునరావాసంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని చైర్మన్ సూచించారు. నిబంధనల ప్రకారం అర్హులైన బాధితులకు పరిహారం అందించడంతో పాటు అవసరాన్ని బట్టి ఉపాధి అవకాశాలు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు, గృహ వసతి, పునరావాస సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా నిలదొక్కుకునేలా సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి నెల గ్రామ స్థాయిలో నిర్వహించే సివిల్ రైట్స్ డే కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాలకు కేవలం కింది స్థాయి సిబ్బంది మాత్రమే హాజరుకాకుండా తహశీల్దార్లు, ఎస్ఐలు, సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. గ్రామీణ ప్రజలకు ఎస్సీ, ఎస్టీల హక్కులు, చట్టపరమైన రక్షణలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అందుబాటులో ఉన్న ఫిర్యాదు పరిష్కార వ్యవస్థలపై అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామస్థాయిలోనే ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా సివిల్ రైట్స్ డే కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో భూ వివాదాలు, ఇతర నేరాల నియంత్రణకు సీసీటీవీ కెమెరాల ఏర్పాటు ఉపయోగకరంగా ఉంటుందని చైర్మన్ పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో అవసరమైన ప్రాంతాలను గుర్తించి పంచాయతీ నిధులు లేదా సీఎస్ఆర్ నిధుల ద్వారా సిసి కెమెరాలు ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

టీపీసీసీ క్రమశిక్షణా కమిటీకి మంత్రి సురేఖ వివరణ

- లేఖను కమిటీ చైర్మన్ మల్లు రవికి పంపించిన మంత్రి

వరంగల్ ఆగస్టు 20(ప్రభాత గమనం):

టిపిసిసి క్రమశిక్షణా కమిటీ జారీ చేసిన నోటీసుకు సంబంధించి అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గురువారం తన వివరణతో లేఖను కమిటి చైర్మన్ మల్లు రవికి పంపించారు. లేఖలో క్రమశిక్షణా కమిటీకి మంత్రి తన వివరణ ద్వారా స్పష్టత నిచ్చారు. ఆగస్టు 19న తన జన్మదినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 'కొండా' కుటుంబ అభిమానులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పలుచోట్ల వేడుకలు నిర్వహించడంతో పాటు సేవా కార్యక్రమాలు చేపట్టారని లేఖలో మంత్రి తెలిపారు. తన స్వస్థలమైన గీసుకొండతో తన కూతురు సుస్మితా పటేల్ కు వున్న ప్రత్యేక అనుబంధం కారణంగా అక్కడి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు నిర్వహించిన జన్మదిన వేడుకల్లో తన కుమార్తె కొండా సుస్మితా పటేల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారని వివరించారు. ఆ కార్యక్రమంలో తన కుమార్తె చేసిన వ్యాఖ్యలు పూర్తిగా తన వ్యక్తిగత అభిప్రాయమని మంత్రి స్పష్టం చేశారు. కుటుంబ బాంధవ్యం కారణంగా ఒకరి వ్యక్తిగత అభిప్రాయాలకు మరొకరు రాజకీయంగా బాధ్యత వహించాలనడం, ఆ ప్రాతిపదికన వివరణ కోరడం సముచితం కాదని మంత్రి సురేఖ పేర్కొన్నారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిగా చేయడం సహజ న్యాయ స్ఫూర్తికి విరుద్ధమని వివరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై, పార్టీ క్రమశిక్షణా నియమావళిపై తనకు సంపూర్ణ గౌరవం ఉందని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విలువలు, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఈ విషయంలో తన ప్రమేయం లేదని గుర్తించి, తనకు జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని క్రమశిక్షణా కమిటీకి గౌరవపూర్వకంగా విజ్ఞప్తి చేశారు.

బ్లాస్టింగ్‌ల హోరు.. దద్దరిల్లుతున్న ఊరు!

- భారీ పేలుళ్లతో వణుకుతున్న రెడ్లవాడ
- గిరిజనుల గుట్టపై నాన్-లోకల్స్ కన్ను
- మామూళ్ల మత్తులో అధికారులు?
- వరంగల్ ఏడీకి బాధితుడి ఫిర్యాదు

నెక్కొండ ఆగస్టు20(ప్రభాత గమనం):

పామాయిల్ ఫ్యాక్టరీ పెడతామంటూ వచ్చి పేదల గుట్టలను పిండి చేస్తున్నారు! వరంగల్ జిల్లా నెక్కొండ మండలం రెడ్లవాడ శివారులో బయటి రాష్ట్రాల వ్యాపారులు బరితెగించి అక్రమ దందా సాగిస్తున్నారు. గతంలో వెనుకబడిన వర్గాలు, గిరిజనుల జీవనోపాధి కోసం ప్రభుత్వం కేటాయించిన విలువైన గుట్టను ఆక్రమించుకోవడమే కాకుండా.. పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిరంతరం భారీ బ్లాస్టింగ్‌లు జరుపుతున్నారు. బాంబు పేలుళ్లను తలపించేలా జరుగుతున్న ఈ దెబ్బలకు చుట్టుపక్కల గ్రామాలు వణికిపోతుంటే, ఇళ్లల్లో ఉండలేక జనం ప్రాణాలు గుప్పెట్లో పట్టుకుని విలవిలలాడుతున్నారు. రాజస్థాన్‌కు చెందిన బాల్ ముకుంద్ అగర్వాల్, శ్రీహరి అగర్వాల్, జీఎమ్ సతీష్ అనే వ్యక్తులు సదరు గుట్టను తామే కొనుగోలు చేశామంటూ హంగామా చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకపోయినా, నిబంధనలను నీరుగారుస్తూ యథేచ్ఛగా మైనింగ్ దోపిడీకి పాల్పడుతున్నారు. ఈ అక్రమ తవ్వకాలపై స్థానిక ప్రజలు పలుమార్లు మొరపెట్టుకున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక భారీ స్థాయిలో మామూళ్లు ముట్టాయనే తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక యంత్రాంగం నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రెడ్లవాడకు చెందిన గిరిజనుడు బాదవత్ కిషన్ నేరుగా వరంగల్ ఏడీని కలసి రాతపూర్వక ఫిర్యాదు అందజేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు నిద్రమత్తు వదిలి తక్షణమే క్షేత్రస్థాయిలో విచారణ జరపాలి. అక్రమ పేలుళ్లకు పాల్పడుతున్న నాన్-లోకల్ ముఠాపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుని, సర్కార్ కేటాయించిన గిరిజనుల గుట్టను రక్షించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని స్థానికులు స్పష్టం చేస్తున్నారు.

కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలి

- తెలంగాణ ఎంపీల సమిష్టి విజ్ఞప్తి

వరంగల్ ఆగస్టు 20(ప్రభాత గమనం):

కాజీపేట కేంద్రంగా ప్రత్యేక రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలన్న చిరకాల డిమాండ్ మరోసారి బలంగా ముందుకు వచ్చింది. వరంగల్ లోక్‌సభ సభ్యురాలు డా. కడియం కావ్య గారు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌కు 20 ఆగస్టు 2026న సమర్పించిన ప్రాతినిధ్య లేఖలో కాజీపేట డివిజన్ ఏర్పాటుపై తక్షణం సానుకూల చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ డిమాండ్‌కు తెలంగాణకు చెందిన పలువురు పార్లమెంట్ సభ్యులు కూడా మద్దతు తెలిపారు. ప్రస్తుతం కాజీపేట ప్రాంతం సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో ఉండగా, వరంగల్ పార్లమెంటరీ నియోజకవర్గంలోని రఘునాథపల్లి నుంచి కాజీపేట, కాజీపేట నుంచి హసన్‌పర్తి, అలాగే కాజీపేట నుంచి చింతల్పల్లి వరకు రైల్వే మార్గాలు సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో ఉన్నాయని లేఖలో పేర్కొన్నారు. కాజీపేట జంక్షన్ దక్షిణ మధ్య రైల్వేలో అత్యంత కీలకమైన రైల్వే కేంద్రాల్లో ఒకటని, అయితే ఇంత ప్రాధాన్యత ఉన్నప్పటికీ ఈ ప్రాంతానికి తగిన స్థాయిలో అభివృద్ధి, పరిపాలనా ప్రాధాన్యత లభించలేదని డా. కడియం కావ్య పేర్కొన్నారు.

కాజీపేట రైల్వేకు ప్రధాన ఆదాయ వనరు

కాజీపేట–కరీంనగర్, కాజీపేట–విజయవాడ, జగ్గయ్యపేట, దోర్నకల్, భద్రాచలం రోడ్, బల్లార్షా తదితర ప్రాంతాల నుంచి భారీ స్థాయిలో సరుకు రవాణా జరుగుతోందని లేఖలో వివరించారు. బొగ్గు గనులు, థర్మల్ పవర్ స్టేషన్లు, సిమెంట్ పరిశ్రమలు, బియ్యం, గ్రానైట్, ఎరువులు, మిర్చి తదితర సరుకుల రవాణాకు ఈ ప్రాంతం అత్యంత కీలకంగా ఉందని తెలిపారు. కాజీపేట ప్రాంతం నుంచి దక్షిణ మధ్య రైల్వేకు సుమారు 48.6 శాతం ఆదాయం వస్తోందని ప్రాతినిధ్య లేఖలో పేర్కొనడం ఈ ప్రాంత ఆర్థిక ప్రాధాన్యతను స్పష్టం చేస్తోంది. బల్లార్షా–కాజీపేట, కాజీపేట–జగిత్యాల తదితర మార్గాల్లో సరుకు రవాణా సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు ప్రత్యేక పరిపాలనా వ్యవస్థ అవసరమని పేర్కొన్నారు.

జోన్ల పునర్వ్యవస్థీకరణతో కొత్త అవకాశాలు

రైల్వే పరిపాలనా పునర్వ్యవస్థీకరణలో భాగంగా విశాఖపట్నం కేంద్రంగా కొత్త రైల్వే జోన్ ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో, విజయవాడ మరియు గుంటూరు డివిజన్లు కొత్త జోన్‌లో విలీనం కానున్నాయని లేఖలో ప్రస్తావించారు. దీంతో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ వంటి డివిజన్లు మాత్రమే మిగిలే పరిస్థితిలో, ఇప్పటికే భారీ రైలు రద్దీ పరిపాలనా బాధ్యతలతో ఉన్న సికింద్రాబాద్ డివిజన్‌ను విభజించి కాజీపేట కేంద్రంగా కొత్త డివిజన్ ఏర్పాటు చేయడం సముచితమని డా. కడియం కావ్య వాదించారు. కొత్త డివిజన్ ఏర్పాటుతో రైల్వే కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు, రైళ్ల నిర్వహణ, సరుకు రవాణా, ప్రయాణికుల సౌకర్యాలు ప్రాంతీయ అభివృద్ధికి ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.

తెలంగాణ ఎంపీల మద్దతుతో మరింత బలపడిన డిమాండ్

కాజీపేట రైల్వే డివిజన్ కోసం తెలంగాణ రైల్వే ఉద్యోగులు, రైల్వే వినియోగదారులు, ప్రజా సంఘాలు చాలాకాలంగా డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో, ఈసారి తెలంగాణకు చెందిన పలువురు ఎంపీలు కూడా తమ మద్దతును వ్యక్తం చేసినట్లు ప్రాతినిధ్య పత్రంలోని సంతకాల ద్వారా స్పష్టమవుతోంది. కాజీపేటను ప్రత్యేక రైల్వే డివిజన్‌గా ఏర్పాటు చేయడం వల్ల ఉత్తర తెలంగాణతో పాటు దక్షిణ మధ్య రైల్వే మొత్తం కార్యకలాపాల్లో పరిపాలనా సామర్థ్యం పెరుగుతుందని, ఈ ప్రాంత ఆర్థిక మరియు పారిశ్రామిక అభివృద్ధికి కొత్త ఊతం లభిస్తుందని ప్రజలు ఆశిస్తున్నారు. కాజీపేట డివిజన్ ఏర్పాటు దిశగా సానుకూల నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ ఎంపీలు కేంద్ర రైల్వే శాఖను, దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులను కోరుతున్నారు.

ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

- రాజీవ్ ఆశయాలను కొనసాగించాలి : చైర్మన్ గంట సంజీవరెడ్డి, మండల అధ్యక్షుడు సమ్మిగౌడ్

కేసముద్రం ఆగస్టు 20(ప్రభాత గమనం):

కేసముద్రం మున్సిపాలిటీ మార్కెట్‌లో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధానమంత్రి, యువ నాయకుడు శ్రీ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ... యువతపై నమ్మకంతో ఓటు హక్కు వయసును 21 నుంచి 18 సంవత్సరాలకు తగ్గించి ప్రజాస్వామ్యంలో యువతకు భాగస్వామ్యం కల్పించారని తెలిపారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం, నూతన విద్యా విధానం, ఐటీ, సాంకేతిక రంగాల అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొనియాడారు.అత్యంత చిన్న వయస్సులోనే ప్రధాని అయ్యిన ఘనత మన రాజీవగాంధీది అని,దేశ అభివృద్ధి, పేదల సంక్షేమం, యువతకు అవకాశాల కల్పనలో రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆధునిక భారత నిర్మాణంలో ఆయన చూపిన దూరదృష్టి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.శ్రీలంకలో శాంతి స్థాపనకు కృషి చేసిన రాజీవ్ గాంధీ 1991లో శ్రీపెరంబుదూరులో ఎల్‌టీటీఈ మానవ బాంబు దాడిలో ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు.నవ భారత నిర్మాణానికి కంప్యూటర్ యుగాన్ని పరిచయం చేసి నేడు భారతదేశ యువత ప్రపంచ నలుమూలల అగ్రగామి లో ఉండేలా చేసిన ఘనత రాజీవ్ గాంధీది అని గుర్తుచేశారు. రాజీవ్ గాంధీ ఆశయాలు, సద్భావన, ఐక్యత,యువత సాధికారతను కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావు,ప్యాక్స్ వైస్ చైర్మన్అంబటి మహేందర్ రెడ్డి , కౌన్సిలర్లు వల్లందాసు ఉమా రవి,సునీత బధ్యనాయక్, రాంబాబు, రదం వెంకన్న, రదం శ్రీనివాస్, తరాల వీరేష్, దామరకొండ ప్రవీణ్, సామల నర్సయ్య,వసంత రావు,ఆరిద్రపు కుమార్, పార్వతి, ప్రభావతి,మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు,గ్రామ పార్టీ అధ్యక్షులు,ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ శాఖ నాయకులు, యువజన, మహిళా కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

P-02_Layout 2 21-Aug-26 02:02 AM Page 1

చిట్యాలలో రిపోర్టర్‌పై దాడి..

- నలుగురు నిందితుల అరెస్టు

ప్రభాత గమనం,వరంగల్ క్రైమ్ బ్యూరో :

భూపాలపల్లి జిల్లా చిట్యాలలో ఆర్‌బీ న్యూస్ రిపోర్టర్ చిరు అలియాస్ రవీందర్‌పై ఇంట్లోకి చొరబడి దాడి చేసి, ఇంటి సామాగ్రిని ధ్వంసం చేసిన కేసులో నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. కైలాపూర్ గ్రామ శివారులో వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, దాడికి ఉపయోగించిన మారుతి స్విఫ్ట్ కారును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. చింతకుంటరామయ్యపల్లి గ్రామానికి చెందిన బొజ్జం వేణుకు, అబ్బెంగుల రాజయ్యకు మధ్య నవాబుపేట శివారులోని భూమి విషయంలో వివాదం కొనసాగుతోంది. ఈ వివాదంపై రిపోర్టర్ రవీందర్ కథనాలు ప్రసారం చేయడంతో పాటు సోషల్ మీడియా గ్రూపుల్లో ప్రచారం చేస్తున్నాడనే కక్షతో వేణు అతనిపై దాడికి పథకం వేసినట్లు పోలీసులు తెలిపారు. ఆగస్టు 17న భూపాలపల్లిలో ఓ కార్యక్రమం అనంతరం వేణు తన స్నేహితులతో కలిసి దాడికి పథకం వేసినట్లు పేర్కొన్నారు. అదే రాత్రి మొత్తం ఎనిమిది మంది రెండు కార్లలో చిట్యాలలోని రవీందర్ ఇంటికి వెళ్లి, తలుపు తీయగానే లోపలికి చొరబడి దాడి చేసినట్లు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు బొజ్జం వేణు, మెంగని నటరాజ్, మొక్కిరాల ప్రణయ్, గోలి అఖిల్‌లను పోలీసులు అరెస్ట్ చేసి, పరకాల జైలుకు తరలించారు. పరారీలో ఉన్న మధువంశి, మహేష్, రాజేష్, ప్రశాంత్, ఆరిఫ్‌ల కోసం దర్యాప్తు కొనసాగుతోందని భూపాలపల్లి డీఎస్పీ ఏ. సంపత్ రావు తెలిపారు.

గార్ల మండలంలో పోలీసుల 'స్పెషల్ నైట్ రైడ్స్'

- గంజాయి, దొంగతనాలపై ఉక్కుపాదం

గార్ల,ఆగస్టు 20(ప్రభాత గమనం):

మండలంలో నేరాల అదుపు, శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు రాత్రి వేళల్లో నిఘాను తీవ్రతరం చేశారు. ఇటీవల కాలంలో పెరుగుతున్న అక్రమ రవాణా, దొంగతనాల కట్టడికి గార్ల–బయ్యారం సీఐ రవీందర్, ఎస్సై సాయి కుమార్ ల ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ద్విచక్రవాహనాలపై విస్తృతంగా 'నైట్ పెట్రోలింగ్' నిర్వహించారు.మండలంలో గంజాయి స్మగ్లింగ్, దొంగతనాలు, నాటుసారా (గుడుంబా) విక్రయాల వ్యాపారుల గుండెల్లో గుబులు పుట్టించేలా పోలీసులు ప్రధాన రహదారులతో పాటు అనుమానిత ప్రాంతాలు, గల్లీల్లో జల్లెడ పడుతున్నారు. వాహనదారులు, వ్యక్తులను ఆపి రికార్డులను, గుర్తింపు కార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. గ్రామాల్లో లేదా పరిసర ప్రాంతాల్లో గంజాయి, గుడుంబా విక్రయాలు, దొంగతనాలు వంటి విద్రోహ చర్యలు కనిపించినా, అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నా ప్రజలు తక్షణమే 100 నంబర్‌కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సీఐ రవీందర్ కోరారు.

ఇస్లావత్ రావుజీ ఆశయ సాధకు పాటుపడాలి

- సీపీఎం ఆధ్వర్యంలో రావూజీ వర్ధంతి
- నివాళులర్పించిన పార్టీ నాయకులు

గార్ల,ఆగస్టు 20 (ప్రభాత గమనం):

సిపిఎం సీనియర్ నాయకులు, గిరిజన సంఘం మండల నాయకుడు అమరజీవి ఇస్లావత్ రావూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనంర్పించే నిజమైన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందుకూరి శ్రీనివాస్ పేర్కొన్నారు.వెంకటాపురం క్రాస్ రోడ్‌లోని రావూజీ స్తూపం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో గురువారం భాగం లోకేశ్వరరావు అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభకు కందుకూరు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై, రావూజీ స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల హక్కులు, గిరిజనుల సంక్షేమం కోసం ఇస్లావత్ రావూజీ చేసిన సేవలు, పోరాటాలు మరవలేనివని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు జి. రాజారావు, వి.పి. వెంకటేశ్వర్లు, ఎ. వీరాస్వామి, ఐ. గోవింద్, సిహెచ్. ఎల్లయ్య, బి. ఉపేందర్ రెడ్డి, సిహెచ్. మౌనిక, జి. వశ్యా, బట్టు లక్ష్మయ్య, నంద్యా, ఎస్.కే. మౌలానా, జి. వీరభద్రం, టి. నాగేశ్వరరావు, లక్ష్మయ్య, వి. కొండయ్య, నవీన్, మల్లయ్య, ప్రవీణ్, సర్వర్, శంకర్, వీరయ్యలతో పాటు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.అలాగే రావూజీ కుటుంబ సభ్యులు ఇస్లావత్ అశోక్, కీర్తి, సాయి, సత్య, విజయ, మంగీలాల్, రాము తదితరులు హాజరై నివాళులర్పించారు.

రసాబాసాగా గార్ల మండల సర్వసభ్య సమావేశం

- వైద్యం, తాగునీరు, విద్యుత్‌పై అధికారుల నిర్లక్ష్యంపై ప్రజాప్రతినిధుల అసహనం
- గ్రామసభలకు రాని అధికారులపై చర్యలకు డిమాండ్
- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం : ప్రత్యేక అధికారి దేశీరామ్ నాయక్

గార్ల, ఆగస్టు 20 (ప్రభాత గమనం):

గార్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక మండల సర్వసభ్య సమీక్షా సమావేశం తీవ్ర ఉద్రిక్త వాతావరణంలో సాగింది. వివిధ శాఖల అధికారుల తీరుపై ప్రజాప్రతినిధులు, సర్పంచులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై అధికారుల నిర్లక్ష్యం, శాఖల మధ్య సమన్వయ లోపం, క్షేత్రస్థాయికి రాకపోవడంపై నిలదీశారు.ఈ సమావేశానికి మండల ప్రత్యేక అధికారి జి. దేశీరామ్ నాయక్ అధ్యక్షత వహించగా, ఎంపీడీవో మంగమ్మ ప్రాథమిక ప్రసంగంతో చర్చను ప్రారంభించారు.పెద్ద కిష్టాపురం సర్పంచ్ గంగావత్ రామ్‌సింగ్ నాయక్ మాట్లాడుతూ.. గ్రామసభలకు, ప్రజా సమస్యల పరిష్కారానికి వివిధ శాఖల అధికారులు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడుతున్నప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు స్పందించకపోవడంపై తీవ్రంగా మండిపడ్డారు. ఈ సమావేశానికి కూడా విద్యుత్ శాఖ ఏఈ గైర్హాజరు కావడం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని మండిపడ్డారు.వ్యవసాయ శాఖ ఏఓ కావటి రామారావు ప్రత్యామ్నాయ పంటల సాగుపై మాట్లాడగా, సర్పంచులు రామ్‌సింగ్ నాయక్, మోతీలాల్ స్పందిస్తూ.. రైతులు ఆఫీసుల చుట్టూ తిరిగే పరిస్థితి రాకుండా క్షేత్రస్థాయిలోనే సేవలు అందించాలని డిమాండ్ చేశారు. ఎరువులపై రాయితీలు, సోలార్ ఫెన్సింగ్, డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రోత్సాహం అందించాలన్నారు. పాఠశాలల సమస్యలపై ఎంఈఓ వీరభద్రరావును సర్పంచులు పిఎం శ్రీ పథకం లెక్కలు, అంగన్‌వాడీ తరగతుల కేటాయింపులపై నిలదీశారు.సీహెచ్‌సీ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, డాక్టర్ హనుమంతరావుల ఎదుట స్థానిక సర్పంచులు వైద్యాధికారుల జవాబుదారీతనంపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఆసుపత్రికి కేటాయించిన ఐదుగురు వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండాలని, ముఖ్యంగా మహిళల కోసం గైనకాలజిస్ట్ డాక్టర్ మౌనిక సేవలు నిరంతరం లభించేలా చూడాలని డిమాండ్ చేశారు. అలాగే మిషన్ భగీరథ ఏఈ చిరంజీవి, ఆర్డబ్ల్యూఎస్ అధికారి అరుణలను తాగునీటి సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయాలపై నిలదీశారు. ముల్కనూర్ సర్పంచ్ వెంకట్రావు మాట్లాడుతూ.. చెరువులు, కుంటల ఆక్రమణలను అరికట్టాలని, అక్రమంగా ఏర్పాటు చేసిన మోటార్లను తొలగించాలని కోరారు.గ్రామ పంచాయతీలకు వైఫై సౌకర్యం, నూతన పేసా కమిటీల ఏర్పాటు. మహబూబాబాద్, ఇల్లందు డిపోల నుంచి మండల మీదుగా ఆర్టీసీ బస్సు షటిల్ సర్వీసులు నడపడం. స్థానిక ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు హాస్టల్ వసతి, ప్రహరీ గోడల నిర్మాణం. ఏర్పాటు చేయాలని కోరారు.ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి జి. దేశీరామ్ నాయక్ మాట్లాడుతూ.. అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ పారదర్శకంగా పనిచేయాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులు లేవనెత్తిన ప్రతి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని సర్పంచులు కోరారు. ఈ సమావేశంలో డీటీ శ్రీరామ్ నాయక్, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులో చోరీ..

- ఊకల్ శివారులో ఘటన
- ముగ్గురు నిందితుల అరెస్టు

ప్రభాత గమనం,వరంగల్ క్రైమ్ బ్యూరో :

గీసుగొండ మండలం ఊకల్ గ్రామ శివారులోని పెట్రోల్ బంకులో నగదు చోరీకి పాల్పడిన ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. కాజీపేటకు చెందిన కంది చరణ్, జక్కుల ప్రతాప్, గండికోట శివలను అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 18న అర్ధరాత్రి ముగ్గురు నిందితులు పెట్రోల్ బంకు వద్దకు వెళ్లి అక్కడి పరిస్థితులను గమనించారు. అనంతరం బంకులో విధులు నిర్వహిస్తున్న మేనేజర్ నిద్రిస్తున్న సమయంలో ఆయన బ్యాగులో ఉన్న రూ.15,800 నగదును అపహరించి ఆటోలో పరారయ్యారు. దొంగిలించిన నగదును ముగ్గురూ పంచుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా ప్రత్యేక క్రైమ్ టీములను ఏర్పాటు చేసిన పోలీసులు గురువారం మరియపురం శివారు కెనాల్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన ఆటోను ఆపగా, అందులో ముగ్గురు నిందితులు పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా చోరీకి పాల్పడినట్లు అంగీకరించినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.11 వేల నగదు, రెండు ఫోన్లు, చోరీకి ఉపయోగించిన ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచడంతో పాటు వారిపై సస్పెక్ట్ షీట్లు తెరవనున్నట్లు పోలీసులు తెలిపారు. కేసును త్వరితగతిన ఛేదించడంలో కీలకంగా పనిచేసిన ఎస్ఐ అనిల్ కుమార్, కానిస్టేబుళ్లు అరవింద్, విజయ్, ప్రవీణ్, సాయిలను గీసుగొండ సీఐ విశ్వేశ్వర్ అభినందించారు.

పాలిటెక్నిక్ విద్యాసంస్థల బంద్ విజయవంతం

- స్వచ్ఛందంగా బందుకు సహకరించిన పాలిటెక్నిక్ విద్యార్థులు
- జీవో నెంబర్ 97 రద్దు చేయాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పట్ల మధు

కేసముద్రం ఆగస్టు 20(ప్రభాత గమనం):

ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రాష్ట్రవ్యాప్త పాలిటెక్నిక్ కళాశాలల బంధు కేసముద్రం మండల కేంద్రంలో పాలిటెక్నిక్ బంద్ విజయవంతమైందని ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి పట్ల మధు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన కళాశాలకు వచ్చిన విద్యార్థులతో కలిసి కళాశాల ముందు నిరసన వ్యక్తం చేశారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ..జీవో నెంబర్ 97 పేరుతో ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందని మండిపడ్డారు. స్కిల్ యూనివర్సిటీ పేరుతో పాలిటెక్నిక్ విద్యను మొత్తం ఐటిఐ లో వెళ్లిన చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే జీవో నెంబర్ 97 ను వెనక్కి తీసుకోవాలని లేని లా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సింహాద్రి, నాయకులు మహేష్, విక్రం, నందీశ్వర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపండి

- ఎంఈఓ కాలేరు యాదగిరి

కేసముద్రం ఆగస్టు 20(ప్రభాత గమనం)

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈఓ కాలేరు యాదగిరి అన్నారు. గురువారం కేసముద్రం మండలం తాళ్లపూసపెల్లి స్కూల్ కాంప్లెక్స్ ను సందర్శించారు.ఈ సందర్భంగా ఎంఈఓ కాలేరు యాదగిరి మాట్లాడుతూ..పాఠశాలలో తరగతుల వారిగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేకంగా రెమిడీయేషన్ కార్యక్రమం నిర్వహించాలన్నారు. వారికి సులభంగా అర్థమయ్యే విధంగా చక్కని టిఎల్ఎం తయారు చేయాలన్నారు. కృత్యాల ద్వారా బోధన చేయాలన్నారు.కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కోట కనకయ్య మాట్లాడుతూ..ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. పాఠశాలలోని అన్ని రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. విద్యాధికారులు పర్యవేక్షణ బృందాలు పరిశీలించే అంశాలను వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సెక్రటరీ గోపాల శ్రీధర్, రిసోర్స్ పర్సన్ యేదునూరి అశోక్, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల గొంతు నొక్కాలని చూస్తే ప్రభుత్వ పతనం తప్పదు

- 'శక్తి' స్కీమ్, జీవో–97ను రద్దు చేయాలి
- విద్యార్థులపై పోలీసుల చర్యను ఖండించిన మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్

గార్ల, ఆగస్టు 20 (ప్రభాత గమనం):

విద్యార్థులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన ఆందోళనపై పోలీసులు వ్యవహరించిన తీరును బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్ తీవ్రంగా ఖండించారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి, 'శక్తి' స్కీమ్, జీవో–97ను బేషరతుగా రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా శీలంశెట్టి రమేష్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య దేశంలో తమ భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేస్తూ విద్యార్థులు శాంతియుతంగా నిరసన చేపడితే వారి సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అందుకు భిన్నంగా విద్యార్థులపై పోలీసు చర్యకు దిగడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు.'శక్తి' స్కీమ్, జీవో–97 వల్ల తమ భవిష్యత్తు ప్రభావితమవుతుందని విద్యార్థులు ప్రశ్నిస్తుంటే, వారి ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం అణచివేతకు పాల్పడటం సరికాదని అన్నారు. విద్యార్థుల ఆందోళనను బలప్రయోగంతో అడ్డుకోవడం సమస్యకు పరిష్కారం కాదని పేర్కొన్నారు.రైతులు తమ సమస్యలపై గళమెత్తినా, విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం ఉద్యమించినా వారి గొంతును అణచివేసే ప్రయత్నం చేయడం సరికాదని రమేష్ అన్నారు. లాఠీలు, అరెస్టులు, నిర్బంధాలతో విద్యార్థుల ఉద్యమాలను ఆపలేరని పేర్కొన్నారు. ప్రభుత్వం ఎంత అణచివేతకు పాల్పడితే అంతగా ప్రజల్లో, విద్యార్థుల్లో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.జీవో–97, 'శక్తి' స్కీమ్‌లను వెంటనే రద్దు చేయాలి.విద్యార్థులపై దురుసుగా వ్యవహరించిన పోలీసు అధికారులపై కఠినమైన చర్యలు తీసుకోవాలి.అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లలో నిర్బంధించిన విద్యార్థులను తక్షణమే విడుదల చేయాలి.విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం వారితో చర్చలు జరిపి సామరస్యపూర్వక పరిష్కారం చూపాలి.శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై అణచివేత ధోరణి కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా యువత, విద్యార్థులు మరింత పెద్ద ఎత్తున ఉద్యమించే పరిస్థితి ఏర్పడుతుందని శీలంశెట్టి రమేష్ హెచ్చరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి విద్యార్థుల డిమాండ్లను పరిష్కరించాలని ఆయన కోరారు.